




# కరపత్రం

SINCE 2014

మంగళవారం జూలై 28, 2026 సంపుటి : 2 సంచిక : 286 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4




# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం

» విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం
» అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సిఎం భట్టి

**ఖమ్మం,జూలై27 :**
తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ

♦ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం



**హైదరాబాద్,జూలై27 :**
మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారని తెలిసిందే.



# శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

▪ ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన భరోసా
▪ చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత అభిప్రాయం

**న్యూఢిల్లీ,జులై 27 :**
నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

2లో



# విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ డిమాండ్

**న్యూఢిల్లీ,జులై 27 :**
దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు.

# సిరిసిల్ల విద్యార్థికి కెటిఆర్ అండ



» ఐఐటిలో సీటు సాధించినందుకు అభినందన
» ల్యాప్‌టాప్ బహుకరణ.. ఫీజు చెల్లింపునకు హామీ

**హైదరాబాద్,జూలై27 :**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తన ఔదార్యం చాటుచేసుకున్నారు. ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన సిరిసిల్లకు చెందిన గడదాస్ అభినవ్‌కు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం ద్వారా ల్యాప్‌టాప్‌ను బహూకరించారు.



2లో

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

» పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
» ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
» లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
» కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్

**హైదరాబాద్,జూలై27 :**
హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు..

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

» కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి
» కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



2లో..

**న్యూఢిల్లీ,జూలై27 :**
గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.



# యశోదలో పెద్దికి మంత్రి సీతక్క పరామర్శ

**హైదరాబాద్,జూలై27 :**
మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్తితిపై మంత్రి సీతక్క ఆరా తీసారు. కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం తెలిపారు. పెద్దిని పరామర్శించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మంత్రి సీతక్క యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేటీఆర్ డాక్టర్లతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

2లో..

# ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

▪ విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం
▪ యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖ అప్పగించాలి
▪ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్



2లో..

**హైదరాబాద్,జులై 27 :**
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థి, యువత జీవితాలతో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపడ్డారు. మరోవైపు యువత ఎన్నికల్లో పోటీ చేసేలా వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కొత్త డ్రామా షురూ చేశారని విమర్శించారు. ఈ క్రమంలో విద్యాశాఖ వైఫల్యాన్ని అంగీకరిస్తూ యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, న్యాయశాఖ తదతర శాఖలను సిఎం సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని ఆయన మీడియా సమావేశంలో మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఖర్గేను తీసేసి యువనేతను ఎన్నుకోవచ్చు కదా..? అని ప్రశ్నించారు.

# జూరాలకు పెరుగుతున్న వరద

▪ నెట్టెంపాడు, కోయిల్ సాగర్ మోటర్లు ఆన్ చేయాలి
▪ మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్


**మహబూబ్ నగర్,జూలై27**
జూరాల ప్రాజెక్టుకు 27,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, మోటార్లును ఎందుకు ప్రారంభించడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టులో ఇప్పటికే 7.1 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి చేరుకుందని వెల్లడించారు. మరికొద్ది గంటల్లో గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారని వివరించారు.



# హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

▪ రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు: ఆర్ఎస్

మిగతాది 2లో



**హైదరాబాద్,జూలై27 :**
వరుస వివాదాల నేపథ్యంలో హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేయడంపై బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. రంగనాథ్ మీదున్న 63 కోర్టు ధిక్కరణలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయ స్థానం ఇన్ని ఉల్లంఘలనకు పాల్పడుతున్న అధికారిని ఇంకా కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని, రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని హైకోర్టు తెలిపిందన్నరు.

## ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

మొదటిపేజీ తరువాయి
భాజపా జాతీయ అధ్యక్షుడిగా యువ నాయకుడు నితిన్ నబీన్‌ను చేశామని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని డైవర్ట్ చేయడానికే.. 21 ఏళ్లకు పోటీ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, స్కూటీ, రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి... విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నిజాయితీ చాటుకున్నారని, తెలంగాణలో రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించకుండా తాత్సారం చేస్తున్న రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటమాడు తున్న రేవంత్ రెడ్డి సర్కార్ క్యాండిల్ ర్యాలీలు చేయడం సిగ్గుచేటని, భవిష్యత్తులో అదే క్యాండిల్‌తో విద్యార్థులు, యువత వారిని తగలబెడతారన్నారు. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో విదేశీ హస్తం ఉందని ఆరోపించారు. యువత, కాంగ్రెస్ నిరసనలతో కేంద్రం దిగి వచ్చిందనే మాటలు అవాస్తమన్నారు. యువతకు 21 ఏళ్లకే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్న రేవంత్ వ్యాఖ్యలను రాంచందర్‌రావు ఖండించారు. ఎన్నికల వయోపరిమితిపై నిర్ణయం తీసుకునే అధికారం సీఎంకు లేదని, ఈ అంశం కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. యువతను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.

## శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

మొదటిపేజీ తరువాయి
భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

## విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

మొదటిపేజీ తరువాయి
విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇందుకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా వారిపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణిలి కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిజాయతీ లేనిదని తాను గతంలోనే చెప్పానని, నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని రాహుల్ విమర్శించారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడంతో పాటు, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని చెప్పుకొచ్చారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

## హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి
ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపదెబ్బలాంటిదన్నారు. రేవంత్ రెడ్డికి ఏ మాత్రం కూడా తెలంగాణను పరిపాలించే నైతిక అర్హత లేదని ఇవాళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా తేలిపోయింది. లక్షమంది పోలీసులున్న ఈ రాష్ట్రంలో హోంమంత్రి అయిన సిఎం హైకోర్టు స్థానిక పోలీసులెవరూ కూడా తెలంగాణ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడలేరు. అందుకు ఆర్మీ అధికారులను ఆదేశించింది.. అంటే అసలు మీకు ఇక నైతిక హక్కు ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతల ప్రభుత్వం. విధ్వంసకర ప్రభుత్వం. లగచర్లలో, వెలుగుమట్లలో నాశనం చేశారు. సున్నం చెరువు పేరుతో, బహదూర్ గూడ పేరుతో, లోతుకుంటలో ఎక్కడ చూసినా విధ్వంసమే. ఆ విధ్వంసం చేస్తూనే మరోవైపు పేదల భూములను మీ సొంత సోదరులు, మీ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కబ్జాలు చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి పోర్టల్‌ను తీసుకొని దొడ్డి దారిన దాదాపు 22 వేల ఎకరాల భూముల హక్కులను రాత్రికి రాత్రే ఎమ్మార్వో, ఆర్డీవోల సంతకాలు లేకుండా బదలాయించారు. అందుకే నేను గతంలో తెలంగాణ ప్రభుత్వంలో పనిచేసిన మీ అధికారిగా, సోదరుడిగా, ప్రభుత్వ అధికారులకు చెబుతున్నా దయచేసి రాజ్యాంగాన్ని పాటించండి. చట్టాన్ని పాటించండి.. కోర్టులు ఇచ్చిన ఆదేశాలను దయచేసి అతిక్రమించకండని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు.

## జూరాలకు పెరుగుతున్న వరద

మొదటిపేజీ తరువాయి
పాలమూరు రైతుకు నీళ్లు అందించకుండా, ఆ నీటిని శ్రీశైలం ద్వారా ఆంధ్రప్రదేశ్ పోతిరెడ్డిపాడుకు వెళ్లేలా చేయడానికే పంపులను ఆన్ చేయడం లేదని
ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని, వరదొచ్చినప్పుడు నీటిని ఎత్తిపోయ కుండా కిందికి జార విడుస్తుందని విమర్శించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కంటే ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలే ముఖ్యమని ఆరోపించారు.తక్షణమే భీమా-1లోని భూత్‌పూర్, సంగంబండ, భీమా-2లోని శంకర సముద్రం , రంగసముద్రం, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని గూడెందొడ్డి విడుదల చేసి నింపాలని కోరారు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

మొదటిపేజీ తరువాయి
సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.
అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు ఇప్పించండి

వీబీజీ రాంజీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలిప్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు నాగిరెడ్డిపేట ఎంపీడీవో గంగాధర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్‌అసిస్టెంట్లు మాట్లాడుతూ మండలం లోని ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ పథకంలో ఉన్న పనులతో పాటు ఇందిరమ్మ ఇల్లు, ఫొటో క్యాప్చర్, ఉపాధి కూలీల అటెండెన్స్, వనమహోత్సవం లాంటి అదనపు పనులు నిర్వర్తిన్నామని చెప్పారు. కానీ తమపై అదనపు పనుల భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకా తమకు సమయానికి జీతం ఇవ్వడం లేదని, ఇప్పటికైన తమకు ప్రతీ నెలా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సోమవారం నిర్వహించిన తమ శాఖ సమిక్ష సమావేశం బహిష్కరించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తమకు మూడు నెలల జీతం రాలేదని, దీంతో తమ కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా రైటింగ్ బోర్డుల పంపిణీ

నిజామాబాద్ మండల పరిధిలోని మల్లారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో కేజీఎఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ఉచితంగా రైటింగ్ బోర్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఈ ట్రస్ట్ ఫౌండర్ జేసీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రతీ చిన్నారికి విద్య, ఆరోగ్యం, క్రీడలు అనే మూడు ప్రధాన రంగాల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి, ఆరోగ్య సేవలు, క్రీడా అవకాశాలను అందిస్తూ వారి భవిష్యత్ అభివృద్ధికి తమ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. , జనరల్ సెక్రటరీ నాగేందర్, ట్రస్ట్ సభ్యులు కలిసి విద్యార్థులకు రైటింగ్ బోర్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సేవ్లా, ప్రధానోపాధ్యాయులు అన్నం గోపాల్, ఉపాధ్యాయులు వెంకట్, రంగా కిషన్, ట్రస్టు జనరల్ సెక్రటరీ నాగేందర్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన

మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. యూనియన్ బ్యాంకులో ఖాతాలు కలిగి ఉన్న కోల్ మైన్స్ పెన్షన్ దారులకు 2024 ఒప్పందం ప్రకారం 70 ఏళ్లలోపు పెన్షనర్లకు రూ. 30లక్షల ప్రమాద బీమా. రూ. 10లక్షల సహజ మరణ బీమా కల్పించడంలో బ్యాంక్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్య మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా యూనియన్ బ్యాంక్ యజమాన్యం సింగరేణి రిటైర్డ్ బొగ్గు పెన్షన్ దారులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం, పది రోజుల్లోగా తమకు బీమా సౌకర్యం కల్పించకపోతే జిల్లా వ్యాప్తంగా కుటుంబాలతో సహా శాంతియుతంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సింగరేణి రిటైర్డు కార్మికులు పాల్గొన్నారు.

## కొల్వాయి ఎత్తిపోతలను ప్రారంభించండి
## రైతులతో కలసి పరిశీలించిన జీవన్ రెడ్డి

జగిత్యాల జిల్లాలోని బీర్పూర్ మండలం కొల్వాయి మండలం ఎత్తిపోతల పథకాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి సోమవారం రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కాలిపోయిన మోటార్లను పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం తో నీళ్లు అందక సాగు చేయడం లేదని రైతులు వాపోయారు. విద్యుత్ డీఈ, ఎస్ఈలతో జీవన్ రెడ్డి ఫోన్లో మాట్లాడారు. కొల్వాయి ఆరేపల్లి లో మోటార్లు మరమ్మతు చేయించాలన్నారు.ఏడాదికాలంగా మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. అధికారులు అంచనాలు రూపొందించేది ఎప్పుడు? నీళ్లు అందించేది ఎప్పుడని ప్రశ్నించారు. రైతుల అదృష్టం కొద్ది కాలువలో నీళ్లు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకునేందుకు మోటర్లు మరమ్మతు చేపట్టి పంపులు వినియోగించాలని కోరారు ఈనెల 31లోగా మోటార్ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల రీప్లేస్మెంట్ చేయగలిగితే ఖరీఫ్ పంట సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే పంటలు ఎండిపోవడానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నీళ్లు ఉండి కూడా పంటలు పండించుకోలేని దుస్థితి రాకుండా చూడాలని కోరారు. అన్ని పంపు సెట్లు వినియోగంలో తీసుకువచ్చి ఖరీఫ్ పంటకు నీరు అందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనావేసేందుకు అధికారులు పంపుసెట్లు పరిశీలించాలని అధికారులకు సూచించారు.

## విదేశీ యువతి పట్ల అసభ్య ప్రవర్తన

కొండాపూర్ ప్రాంతంలో విదేశీ యువతి పట్ల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తన బాయ్‌ఫ్రెండ్‌ను కలిసేందుకు మార్చి నెలలో భారత్‌కు వచ్చింది. ఆయువతి.. తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి నివసిస్తుండగా, అదే ఇంట్లో మరో యువకుడు ఆదిత్య ఆనంద్ ఉంటున్నాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాయ్‌ఫ్రెండ్ ఇంట్లో లేని సమయంలో ఆదిత్య ఆనంద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని నెదర్లాండ్స్ యువతి ఆరోపణలు చేసింది. యువకుడి చేష్టలతో విసిగిపోయిన యువతి.. భారత్ నుంచి తిరిగి నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడి ఎంబసీకి ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం యువతి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. జరిగిన విషయాలన్నింటినీ గచ్చిబౌలి పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు ఆధారంగా ఆదిత్య ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడు. యువకుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

మొదటిపేజీ తరువాయి
రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

## యశోదలో పెద్దికి మంత్రి సీతక్క పరామర్శ

మొదటిపేజీ తరువాయి
కుటుంసభ్యులను పరామర్శించిన కేటీఆర్, మంత్రి సీతక్క వారిలో మనోధైర్యాన్ని నింపారు. కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు.

## సిరిసిల్ల విద్యార్థికి కెటిఆర్ అండ

మొదటిపేజీ తరువాయి
కాలేజీ ఫీజును కూడా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. సిరిసిల్లకు చెందిన గడదాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, శ్రీలతతో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన అభినవ్‌ను కేటీఆర్ శాలువాతో సత్కరించారు. అనంతరం గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం కింద ల్యాప్‌టాప్ అందజేశారు. అంతేకాకుండా అభినవ్ కాలేజీ ఫీజును కూడా తానే చెల్లిస్తానని భరోసా ఇచ్చారు.
కేవలం చదువు మీద దృష్టి పెట్టి.. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభినవ్‌కు కేటీఆర్ సూచించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు అభినవ్, అతని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి అందించిన ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరువబోమని,
కేటీఆర్‌కు రుణపడి ఉంటామని అన్నారు.

## డ్రగ్స్ మత్తులో పోలీసులపై కారుతో దూసుకెళ్లిన యువకుడు

ఇ
డ్రగ్స్ మత్తులో ఉన్న ఓ యువకుడు తనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైకే కారుతో దూసుకెళ్లిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. ఈ ఘటనలో ఓ హెడ్ కానిస్టేబుల్ కాలుకు తీవ్ర గాయాలు కాగా, ఇన్‌స్పెక్టర్‌తో పాటు మరో కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నిందితుడు సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. అబిడ్స్ ప్రాంతంలో డ్రగ్స్ కొనుగోలు, విక్రయాలు జరుగుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే ఆయన ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం అబిడ్స్ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఓ కారు అబిడ్స్ చేరుకుంది. కారులోని వ్యక్తికి మరో వ్యక్తి వచ్చి అనుమానాస్పద ప్యాకెట్ అందజేయగా, అక్కడే మాటువేసిన పోలీసులు ప్యాకెట్ ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కారులో ఉన్న నిందితుడిని బయటకు దిగాలని ఆదేశించారు.
యితే కారు పక్కకు తీస్తున్నట్లు నటించిన నిందితుడు ఒక్కసారిగా రివర్స్‌లో వేగంగా నడిపాడు. ఈ సమయంలో అడ్డుకునేందుకు ప్రయత్నించిన హెడ్ కానిస్టేబుల్ మహేందర్ కాలు మీదుగా కారును ఎక్కించడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో పాటు మరో కానిస్టేబుల్‌కు కూడా గాయాలయ్యాయి. నిందితుడు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా, ఇన్‌స్పెక్టర్ తన
బృందంతో కలిసి వెంటాడారు. అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో కారును అడ్డుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌గా పోలీసులు గుర్తించారు.
రోవైపు, కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌ను వెంటనే సోమాజిగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానిస్టేబుల్ కాలును పరీక్షించిన వైద్యులు విరిగినట్లు నిర్ధారించి

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం జూలై 28, 2026

# ఇంకో డిజిటల్ ప్లాట్ ఫాం

# జనరల్ జనతా పార్టీ వచ్చింది

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

కాక్రోచ్ జనతా పార్టీ .. CJP తరహాలోనే 'జనరల్ జనతా పార్టీ ..GJP పేరిట మరొక వ్యంగ్య డిజిటల్ ప్లాట్‌ఫారమ్/ఉద్యమం ప్రారంభమైంది.

కాక్రోచ్ జనతా పార్టీ సాగించిన ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ఉద్యమం దేశవ్యాప్తంగా వివాదాల బారిన పడింది.

నీట్ పరీక్షల పేపర్ లీక్ అయిందన్న సాకుతో ఢిల్లీ జంతర్ మంథర్ లో జరిగిన విద్యార్థుల ధర్నా చూసాము.

▪ ఈ ధర్నా లో వేల మంది సంఘవిద్రోహ శక్తులు చేరి దేశంలో అన్న కల్లోలం సృష్టించి శాంతిభద్రతలను భంగం చేసే కుట్రలను చూసాము.

ఈ కుట్ర వెనుక మన భారత దేశ వ్యతిరేక శక్తులు చైనా పాకిస్తాన్ నుండి అమెరికా వరకు ఒక లోతైన కార్యాచరణ ఉంది.

నీట్ పేపర్ లీక్ అనేది ఒక కారణం మాత్రమే.

▪ ఈ కారణం పేరుతో దేశాన్ని అస్థిరపరచాలని జరిపిన కుట్రను భగ్నం చేయడానికి విద్యార్థుల ప్రయోజనాలు కాపాడడానికి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి అటు విద్యార్థుల భవిష్యత్తును ఇరుదేశ భవిష్యత్తును కాపాడాడు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసిన నేపథ్యంలో, అదే స్ఫూర్తితో జనరల్ కేటగిరీ విద్యార్థుల సమస్యలపై గొంతుకగా ఈ కొత్త వేదిక ఉనికిలోకి వచ్చింది.

ఈ రెండు ప్లాట్‌ఫారమ్‌లకు సంబంధించిన ముఖ్యమైన వివరాలు.

**జనరల్ జనతా పార్టీ**
General Janta Party

ఉద్దేశం ఇది ముఖ్యంగా జనరల్ కేటగిరీ (General Category) కి చెందిన మధ్యతరగతి యువత మరియు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీపడే అభ్యర్థుల .. Aspirants సమస్యలను ప్రతిబింబించే ఒక వ్యంగ్య డిజిటల్ వేదికగా ప్రారంభమైంది.

**లక్ష్యం**

రాత్రింబవళ్లు కష్టపడి చదివి, పరీక్షల ఫీజులు కట్టి, చివరకు విపరీతమైన కటాఫ్ (Cutoff) మార్కుల వల్ల మరియు పేపర్ లీకేజీల వల్ల నష్టపోతున్న సాధారణ విద్యార్థుల అసంతృప్తిని, ఆవేదనను హాస్యం, వ్యంగ్యం .. Satire రూపంలో పంచుకోవడానికి General Janta Party అనే వెబ్‌సైట్ ఏర్పాటైంది.

నటటక్స్ అటెంప్ట్ పక్కా అనే నినాదంతో ఇది నెటిజన్లను ఆకర్షిస్తోంది.

▪ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను ఉద్దేశించి చేసిన కొన్ని వ్యాఖ్యలకు నిరసనగా అభిజీత్ దీప్కే అనే యువకుడు 2026 మే నెలలో కాక్రోచ్ జనతా పార్టీ అనే వ్యంగ్య ఉద్యమాన్ని డిజిటల్ మాధ్యమాల్లో ప్రారంభించారు.

కాక్రోచ్ జనతా పార్టీ లాగే ఈ జనరల్ జనతా పార్టీ కూడా ఎన్నికల సంఘం వద్ద నమోదైన అధికారిక రాజకీయ పార్టీలు కావు.

వ్యవస్థపై, విద్యా విధానాలపై యువత తమకున్న నిరసనను మరియు అసంతృప్తిని వ్యంగ్య రూపంలో వ్యక్తపరచడానికి ఉపయోగించుకుంటున్న సరికొత్త సామాజిక మాధ్యమ వేదికలు.. వీటివి Movements మాత్రమే.

**– జనరల్ జనతా పార్టీ .. GJP అనేది ఒక వ్యంగ్య డిజిటల్ ప్లాట్‌ఫారమ్ కాబట్టి, దీనికి భారత ఎన్నికల సంఘం .. ECI కేటాయించిన అధికారిక ఎన్నికల గుర్తు ఏదీ లేదు.**

అయినప్పటికీ, ఈ మూవ్‌మెంట్ తమ సోషల్ మీడియా పేజీలు మరియు General Janta Party అధికారిక వెబ్‌సైట్‌లో ఒక ప్రత్యేకమైన లోగో/గుర్తును ఉపయోగిస్తోంది.

**డిజిటల్ లోగో:**

ఈ ప్లాట్‌ఫారమ్ తమ లోగో గా "ఒక చేతిలో పుస్తకం, మరో చేతిలో ల్యాప్‌టాప్ పట్టుకుని, తలపై నిరాశతో కూడిన ఎక్స్‌ప్రెషన్ ఉన్న విద్యార్థి కార్టూన్ బొమ్మ" ను లేదా ఒక సాధారణ మధ్యతరగతి అభ్యర్థి .. Aspirant చిత్రాన్ని ప్రతీకాత్మకంగా వాడుతోంది.

ఇది నిజమైన రాజకీయ పార్టీ కానందున కమలం, చెయ్యి, కారు వంటి సాంప్రదాయ గుర్తులు వీరికి ఉండవు. సాధారణ కేటగిరీ విద్యార్థుల అవస్థలను, విపరీతమైన కటాఫ్ మార్కుల భారాన్ని సూచించేలా ఈ డిల్లా ప్లాట్‌ఫామ్ లోగోలు డిజైన్ చేయబడ్డాయి.

# సూర్జిత్ నగర్ లో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ వెంటనే పూర్తి చేయాలి

▪ డిఈ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు కారు ఉపేందర్

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, జూలై 27**

31వ డివిజన్ న్యూ శాయంపేట ప్రాంతంలోని సుర్జిత్ నగర్ లో సిపిఎం పార్టీ కాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో 31వ డివిజన్ సూర్జిత్ నగర్ లో అసంపూర్తిగా వదిలేసిన రోడ్లు, డ్రైనేజీలను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ.. సోమవారం హనుమకొండ నక్కలగుట్ట ఆర్ అండ్ బి డీఈ కార్యాలయం వద్ద సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన కారు ఉపేందర్ మాట్లాడుతూ.. సూర్జిత్ నగర్ కాలనీకి రోడ్లు డ్రైనేజీ మంజూరై పనులు ప్రారంభించి నప్పటికీ కాంట్రాక్టర్ ఐదు గల్లీలలో కేవలం మట్టి మాత్రమే పోసి వదిలేయడం పని పూర్తి చేయకపోవడం వలన కాలనీలో రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, వర్షాకాలం డాక్టర్స్ కాలనీ మరియు మిగతా ప్రాంతాల నుండి వర్షపు నీరు లోతట్టు ప్రాంతంగా ఉన్న కాలనీలోకి రావడం వలన ఇండ్లలోకి నీళ్లు వచ్చి నిత్యవసర సరుకులు వస్తువులు తడిసిపోయి కాలనీ ప్రజలకు ఆర్థికంగా తీవ్ర నష్టం జరుగుతుందని రోడ్లు, డ్రైనేజీ పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని ఎంతో ఆశపడ్డ కాలనీవాసులకు తీవ్ర నిరాశ ఎదురైందని,



పూర్తిస్థాయిలో పనులు పూర్తికాక మళ్ళీ ప్రజలు నష్టపోయే పరిస్థితి ఉందని సంబంధిత అధికారులు సమీక్షించి కాలనీలో రోడ్లు డ్రైనేజీలు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిచో కాలనీ వాసు లందరినీ ఐక్యం చేసి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో పార్టీ నాయకులు జంపాల రమేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కురుకు రంజిత్ పార్టీ శాఖ కార్యదర్శులు దార్నా ప్రభాకర్, వంగ సదానందం, ఇనుముల వనమాల, కురుకు రజిత కావటికేతమ్మ, పెండ్యాల లక్ష్మణ్, ఎండి షర్ఫుద్దీన్, గజవెల్లి మొగిలి రేణిగుంట మయూరి, దౌపాటి వెంకన్న, పైండ్ల కళ, శిరీష, అచ్చునూరి ఐలయ్య, ఎర్ర అంజమ్మ, కోర్ర బేబీ, అడప రోజా, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి మెడలో మూడు తులాల మంగళసూత్రం చోరీ



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొత్తగూడెం గ్రామంలో సోమవారం పట్టపగలు చోరీ జరిగింది. ఇంట్లో నిద్రిస్తున్న జాల కేతమ్మ(70) మెడలోని సుమారు మూడు తులాల బంగారు మంగళసూత్రాన్ని బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అపహరించి ఎదులాబాద్ వైపు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి సీసీటీవీ దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

# రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి




**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం లేదని, రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కథలాపూర్ మండల వ్యవసాయ అధికారి యోగితా అన్నారు. కథలాపూర్ రైతు వేదిక లో సోమవారం నుండి బుధవారం వరకు నిర్వహిస్తున్న విత్తన మేళా కార్యక్రమంలో మొక్కజొన్న, కందులు, పెసర, కుసుమ, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని మండల రైతు సోదరులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ. ఓ లు సంధ్యారాణి, మౌనిక, సుష్మ శ్రీ, రాఘవేంద్ర వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# వరంగల్ విద్యా అభివృద్ధిపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూలై 27**

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్, భౌతిక మౌలిక వసతుల కల్పనపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. సమగ్ర శిక్ష పథకం అమలు, డిజిటల్ విద్య విస్తరణ, పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, కేంద్ర నిధుల కేటాయింపులపై సమగ్ర వివరాలు కోరారు. గత కొంతకాలంగా వరంగల్‌లో ప్రభుత్వ విద్య బలోపేతం, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల పెంపు అంశాలను నిరంతరం పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తాజాగా డిజిటల్ విద్యా మౌలిక వసతులపై కేంద్రాన్ని ప్రశ్నించారు. తెలంగాణతో పాటు వరంగల్ జిల్లాకు గత ఐదేళ్లలో కేంద్రం నుంచి అందిన సహాయం, చేపట్టిన పనులు, విద్యార్థులకు కలిగిన ప్రయోజనాల వివరాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.



సమగ్ర శిక్ష పథకం కింద దేశవ్యాప్తంగా పీఎం ఈ-విద్య, దీక్ష, ఐసీటీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ద్వారా సాంకేతిక ఆధారిత బోధనను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల వార్షిక కార్యాచరణ ప్రణాళికల మేరకు కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణకు గత ఐదేళ్లుగా డిజిటల్ విద్యా వసతుల అభివృద్ధికి గణనీయమైన మద్దతు లభించిందని కేంద్రం వెల్లడించింది. 2025-26 విద్యా సంవత్సరంలో రాష్ట్రానికి 1,242 ఐసీటీ ల్యాబ్‌లు, 2,036 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లకు ఆమోదం లభించగా, ఇందుకు రూ. 108.98 కోట్ల మేర నిధులు మంజూరు చేసినట్లు పేర్కొంది. ఈ మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌లో ప్రభుత్వ విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. పార్లమెంట్ వేదికగా వరంగల్ అవసరాలను నిరంతరం కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నానని, విద్య, మౌలిక వసతులు, డిజిటల్ సదుపాయాల విషయంలో మరిన్ని నిధులు, ప్రాజెక్టులు సాధించేందుకు తన కృషి కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ వసతులు, ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అందుకు కేంద్రం మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. వరంగల్‌ను విద్యా రంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు తాము కట్టుబడి ఉన్నామని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు.

# చైతన్య భూమిలో విశ్వ జ్ఞానులకు పూల మాలలు

▪ ముఖ్య అతిధి : అద్దంకి సరిత కృష్ణ

**కరపత్రం ప్రతినిది జులై 27,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.**

మల్కాజ్గిరి మున్సిపల్ కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ లోని రాజీవ్ గృహ కల్ప కాలనీ లోని మాల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో చైతన్య భూమి వద్ద ఉన్న మహా నీయులు మహాత్మా జ్యోతి రావ్ పూలే, బాబా సాహెబ్ డాక్టర్, బి, ఆర్, అంబెద్కర్ గార్లకు ప్రతి ఆదివారం జరిగే పూల జరుగుతుంది, ఈ
29 మరియు 229 జ్ఞాన మాల కార్యక్రమనికి వచ్చిన ముఖ్య అతిధి అద్దంకి సరిత కృష్ణ గార్లు అ మహానుభావులకు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు.

వారికీ మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వారి షాల్వాతో



సత్కారం జరిగింది,ఈ సందర్భంగా అద్దంకి సరిత మాట్లాడుతూ బాబా సాహెబ్ ఇచ్చిన స్ఫూర్తి తో మన చైతన్య భూమి అభివృద్ధి కొరకు నేను కూడా అర్థక సహాయం చేస్తాను అన్నారు. అనంతరం జాతీయ మాలమహానాడు సంఘం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు గుజ్జుక పర్శురాం మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్య గెలుపు (చైతన్య భూమి) అంబేద్కర్ విగ్రహం ముందు విజయసంకేతం ఇచ్చారు

ఇది మన దేశ యువత విజయం విద్యార్థుల త్యాగం కాక్రోచ్ జనతాపార్టీ పోరాటం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఇది ప్రజాస్వామ్య విజయం అన్నారు ఈ గొప్ప కార్యక్రమం లో సీనియర్ మాల సంఘం నాయకులు సంఘం అధ్యక్షులు కోలాటి,రాజు,
బయ్యే గౌతమ్, యాట రాజు, మోతె రాజేంద్ర ప్రసాద్, కాలనీ అధ్యక్షులు పోతారాజు రాములు, బత్తుల శ్రీనివాస్, పాడుగుల రూప చంద్రమౌళి, గ్యాస్ వెంకటేష్, పోతుల వెంకటేష్, వినాయక రావ్ బల్ల ఈశ్వరి దంపతులు మరియు చెన్నయ్య పాల్గొని కార్యక్రమన్ని విజయవంతం చేసారు

# బిఎల్వోలకు సన్మానం

**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

ఎస్ఐఆర్ కార్యకరమాన్ని 100 శాతం డిజిటలైజేషన్ చేసిన కథలాపూర్ మండలం పోతారం బిఎల్వో లు అంబటి స్వరూప, సిరికొండ పద్మ లను, ఆర్. ఐ రవీందర్, సూపర్ వైజర్ ప్రశాంత్, జీపీవో యశ్వంత్ లను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్



పులి శిరీష హరిప్రసాద్ శాలువా తో సన్మానించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కును కల్పించే మహత్తర కార్యక్రమంలో భాగమైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నర్సయ్య, రాజారెడ్డి, దామోదర్ గ్రామస్తులు రమేష్, భూమయ్య, దేవరాజం, బుచ్చి గంగారాం, తొట్ల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంబెడ్కర్ సెంటర్లో మహనీయులకు జ్ఞాన మాలలు

▪ అందరు చట్టం తెల్సుకొని హక్కులు సాధించుకోవాలి

▪ బోడ నరేష్



**కరపత్రం ప్రతినిధి జులై 27,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.** మల్కాజ్గిరి మున్సిపాల్ కీసర సర్కిల్ దమ్మాయి గూడ డివిజన్ లోని రాజీవ్ గృహ కల్ప కాలనిలోని అంబెద్కర్ సెంటర్ లో అంబెద్కర్ యూవజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం పూల మాల కార్యక్రమం జరుగుతుంది ఈ 26 వ పూలమాల కార్యక్రమనికి తెలంగాణ ఉద్యమకారుడు బోడ నరేష్ ముఖ్య అతిధులుగా హాజరై డాక్టర్,, బి, ఆర్, అంబెద్కర్ మరియు డాక్టర్,, జాగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈ నాటి సభకు అంబెద్కర్ సంఘం జనరల్ సెకరేటరీ ఉల్లి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో ముఖ్య అతిధి హాజరైన బోడ నరేష్ మాట్లాడుతూ డాక్టర్,,బి, ఆర్, అంబెద్కర్ అయన పుట్టిన క్షణం నుంచి తుదిశ్వాస విడిచే వరకు ఆయన జీవితం ఒక నిరంతర యుద్ధం. అది కేవలం ఆకలి మీదో, అంటరానితనం మీదో చేసిన యుద్ధం మాత్రమే కాదు. తన చుట్టూ ఉన్న ఆత్మీయుల మరణాలు గుండెను పిండేస్తున్నా, దేశం కోసం తన మేధస్సును ధారపోసిన ఒక అలుపెరుగని మహా యజ్ఞం చేసిన మహాయోడు అంబెద్కర్ అనీకొనియాడారు. అయన అందించిన భారత రాజ్యాంగం ను ప్రతి ఆర్టికల్ ను ఇప్పటి నుండే చిన్న పిల్లకు చదువు పిస్తే పెద్దాయక చేడు మార్గం కాకుండా మంచిమార్గం లో నడిచి ప్రయోజకులు అవుతారు అని అన్నారు. అంబెద్కర్ సంఘం సలహా దారులు మంగళ పూరి వెంకటేష్ మాజీ కౌన్సిలర్, సంఘం అధ్యక్షులు అధ్యక్షులు ప్రజా డాక్టర్ గోల్లూరి రాజు, ఆర్ జి కె కాలనీ దేవాలప్మెంట్ సంఘం అధ్యక్షులు పోతారాజు రాములు, సంఘం జనరల్ సెకరేటరీ ఉల్లి సురేష్ , పాడుగుల చంద్రమౌళి ఢిల్లీలో లోని జంతర్ మంతర్ వద్ద యూత నిట్ పరీక్ష పేపర్ లీక్ సంబందించి శాంతియూత నిరసన తో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం గొప్ప విజయం గా భావించి వారికీ అభినందనలు తెలుపుతూ ఆ పోరాటం లో అమరులైన వారికీ జోహార్లు అర్పించారు. అనంతరం ఈ నాటి పూల మాల ముఖ్య అతిధి బోడ నరేష్ కు షాల్వతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో డబుల్ గాదె, రామకృష్ణ, పాడుగుల రూప,బల్ల, ఈశ్వరి, డి, నాగేశ్వరావు, పి నాగరాజు, పి ఎల్లయ్య, బి అజయ్, గాలి సురేష్, నామడి రాజు, బి శ్రీనివాస్, డి వెంకటేశ్వర్లు, కె దానిరాజ్, బి రాంకుమార్, పి నాగరాజు, బయ్యే గౌతమ్, లు పాల్గొని కార్యక్రమన్ని విజయవంతం చేశారు.

# ప్రజావాణిలో 189 వినతులు స్వీకరణ

▪ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**కరపత్రం ప్రతినిధి వరంగల్,జూలై 27** ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు సమగ్రంగా పరిశీలించి,త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 189 దరఖాస్తులు అందగా,వాటిలో రెవెన్యూ శాఖకు 49,డీఆర్డీవోకు 12,హౌసింగ్ శాఖకు 68,ఇతర శాఖలకు 60 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్ చేసి,క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ముఖ్యంగా రెవెన్యూ,హౌసింగ్,పెన్షన్ సంబంధిత సమస్యలపై అధిక సంఖ్యలో వినతులు వచ్చినట్లు పేర్కొంటూ,వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)జి.సంధ్యారాణి,అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)వై.వి.గణేష్,జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఆర్డీఓ నాగ పద్మజ, డీఎంహెచ్‌వో డా.ప్రకాష్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ప్రజావాణికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను వినతుల రూపంలో సమర్పించారు.

# గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందికి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

.బి కె యం యు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జులై 27** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి బకాయిలను వెంటనే విడుదల చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ నెలలకు ఎన్ఆర్ఇజిఎస్ కింద గ్రామీణ ప్రాంతాల్లో పనులు కలిగించారన్నారు, ఆ తరువాత ఆ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం విబిజి రా మ్ జీ గా మార్చిందన్నారు. గ్రామాలలో జాబ్ కార్డు కలిగియున్న కార్మికులకు ఉపాధి పనులు కలిగించుటలో కీలక పాత్ర పోషిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ,టెక్నికల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్లు రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 12, 500 మంది పని చేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పనులను గుర్తించడం, కార్మికులకు పనులు కలిగించడం, పేర్లు నమోదు చేయడం, ఫోటోలు తీసి అప్లోడ్ చేయడం, పనులకు సంబంధించిన కొలతలు చేయడం, చేసిన పనుల మరియు కూలీల వివరాలు ఆన్లైన్లో ఎంటర్ చేయడం మొదలైన పనులను నిర్వహిస్తూ ఉపాధి పనులను జయప్రదంగా నిర్వహిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వలసలు పోకుండా నిరోధించేందుకుగాను, ఏ గ్రామంలోని కూలీలకు ఆ గ్రామములోనే ఉపాధి పనులు కల్పించేందుకు ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు జరపడంలో సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎంతో శ్రమ కోర్చి విధులను నిర్వహిస్తూ, లక్ష్యాలను సాధించడం కోసం కృషి చేస్తున్న వీరికి ఇస్తున్నది అరకొర వేతనాలే అయిన వాటిని నెలల తరబడి ఇవ్వనందున వారి కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మూడు నెలల పనులకు సంబంధించిన వినియోగ బిల్లులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు పంపించినందున ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆ నిధులను విడుదల చేయాలన్నారు. నిత్యావసర ధరల పెరుగుదలకు అనుగుణంగా సిబ్బందికి వేతనాలు పెంచాలని, రెగ్యులర్ గా వేతనాలు నెల నెలా చెల్లించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. లేనిచో ఉపాధి హామీ సిబ్బంది , కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు.

# ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించన శివకుమార్ కుటుంబ సభ్యులకు డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ సంఘం ఆర్థిక సహాయం



**కరపత్రం ప్రతినిధి జులై 27,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ దమ్మాయి గూడ డివిజన్ లోని ఆర్ జి కే కాలనీలో 102 బిల్డింగ్ లో నివాసముంటున్న శివకుమార్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించారు ఆ నిరుపేద కుటుంబనికి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 5100 రూపాయలు కమిటీ సభ్యులు అందరూ కలిసి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి ఆ కుటుంబనికి భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంబేద్కర్ సంఘం నికి శివకుమార్ కుటుంబం ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎంజీఎం ఆసుపత్రిలో మహిళ మెడలోని బంగారు పుస్తెలు చోరీ

**కరపత్రం ప్రతినిధి వరంగల్ జులై 27**



వరంగల్ కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త మద్యం మత్తులో వచ్చి కొట్టడంతో గాయపడిన ఓ మహిళ చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లగా,అక్కడ గుర్తుతెలియని దొంగలు ఆమె మెడలోని బంగారు పుస్తెలను అపహరించిన ఘటన వెలుగులోకి వచ్చింది.ఫిర్యాదురాలి కథనం ప్రకారం,ఈ నెల 25న సాయంత్రం సుమారు 5 గంటలకు చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి చేరుకుంది.అప్పటికే ఓపీ సమయం ముగియడంతో ఆసుపత్రిలోనే ఉండిపోయింది.అనంతరం జూలై 26న రాత్రి సుమారు 7 గంటలకు రూ.5 భోజనం చేసి,ఎమర్జెన్సీ వార్డు పక్కన ఉన్న గద్దెపై విశ్రాంతి తీసుకుంది.రాత్రి సుమారు 8.30 గంటలకు మేల్కొని చూడగా,మెడలో ఉన్న పసుపు తాడు కత్తిరించి,దానికి ఉన్న రెండు బంగారు పుస్తెలు కనిపించలేదని గుర్తించింది.గుర్తుతెలియని వ్యక్తులు వాటిని అపహరించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.చోరీకి గురైన రెండు బంగారు పుస్తెలు సుమారు 5 గ్రాముల బరువు ఉండగా,వాటి విలువ దాదాపు రూ.40 వేల వరకు ఉంటుందని తెలిపింది.ఈ ఘటనపై గుర్తుతెలియని దొంగలను గుర్తించి,వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులను కోరింది.

# ఎలినోవా ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

▪ ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి: కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి

▪ రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ సూచనలను అనుసరించాలని పిలుపు: పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూలై 27** హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులను ప్రభావితం చేసే ఎలినోవా పరిస్థితులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హనుమకొండ కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు, హనుమకొండ డీసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహారెడ్డితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం తెలంగాణ ప్రదేశ్ కమిటీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఎలినోవా ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షపాతం అసమానంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, దీని ప్రభావం వ్యవసాయ రంగంపై పడే అవకాశం ఉందని అన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు విడుదల చేసే సూచనలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సాగు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించడం, భూసారాన్ని కాపాడే విధానాలను పాటించడం, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. అనుకోని వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంట బీమా పథకాలను వినియోగించు కోవాలని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఆయన సూచించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ కిసాన్ సెల్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అదే విధంగా హనుమకొండ కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు, ఒకర్ల హనుమకొండ డీసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ(ఎలినోవా) పరిస్థితులకు అనుగుణంగా రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేయడంతో పాటు, విత్తనాలు, ఎరువులు, సాగు పద్ధతుల విషయంలో వ్యవసాయ అధికారుల సలహాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. రైతులు ఒక్క పంటపైనే ఆధార పడకుండా ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యానవన పంటలు, పశుపోషణ వంటి అనుబంధ వ్యవసాయ రంగాలపై కూడా దృష్టి సారిస్తే ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# కార్గిల్ వీరులకు ఘన నివాళి...

## భీమారంలో కార్గిల్ విజయ్ దివస్ ఘన నిర్వహణ

▪ దేశ రక్షణకు యువత ముందుకు రావాలి - తెలంగాణ ఉద్యమకారుడు ఆకుల కుమార్



**కరపత్రం ప్రతినిధి భీమారం, జూలై 27** కార్గిల్ యుద్ధంలో భారత మాత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి, శత్రువులను తిప్పికొట్టి కార్గిల్ శిఖరాలపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన అమర వీర జవాన్ల త్యాగాలు చిరస్మరణీయమని తెలంగాణ ఉద్యమకారుడు ఆకుల కుమార్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా హనుమకొండ జిల్లా భీమారంలోని 55వ డివిజన్ భీమారం బస్టాప్ వద్ద ఆకుల కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర వీర జవాన్ల చిత్రపటాలకు కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆకుల కుమార్ మాట్లాడుతూ, 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు అసమాన ధైర్యసాహసాలతో పోరాడి దేశానికి విజయాన్ని అందించారని కొనియాడారు. వారి త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను గత 27 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా గౌరవప్రదంగా నిర్వహిస్తున్నామని, అమర జవాన్ల ఆశయాలను కొనసాగించే బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. దేశ రక్షణ కోసం యువత అధిక సంఖ్యలో భారత సైన్యంలో చేరి సేవలందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండారి సుభాష్, నాయకపు శ్రీనివాస్, గుంజ సాయికుమార్, బూర శరత్, ఆకుతోట ప్రకాష్, చెట్లపల్లి భాస్కర్, బాలగోని రమేష్, ఆకుల రాహుల్, సంఘాల సునీల్, చికెన్ సెంటర్ రమేష్, ఉప్పు రమేష్, నాయకపు రాధాకృష్ణ, మాజీ ఆర్మీ జవాన్లు రాతిపల్లి రాజు, సురేంద్రనాథ్, గోపతి రామ్ నరేష్‌తో పాటు స్థానిక యువకులు ఆకుల రోహిత్, సంఘాల క్రాంతి, అభిషేక్, సుప్రతిక్, ఆకుల ధర్మతేజ, సూర్యతేజ, విష్ణు పాండే, బూర వరుణ్, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతున్న బాబు

– మణిహారంగా మారనున్న భోగాపురం విమానాశ్రయం

గత రెండేళ్లలో ఉత్తరాంధ్ర, విశాఖలో వినూత్నమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారంమీడియాతో మాట్లాడుతూ.. విశాఖను దేశంలో నంబర్-1 నగరంగా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం మణిహారంగా నిలవనుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రధాని సభకు వచ్చే ప్రజల రవాణా కోసం సుమారు 2 వేల బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా దింసా నృత్యంతో ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలుకుతామని మంత్రి అన్నారు. భోగాపురం విమానాశ్రయ ప్రయాణికులకు సాధారణ బస్సు ఛార్జీలతోనే ఎలక్ట్రిక్ బస్సు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఏపీఎస్ఆర్టీసీ(ంఖాఖిఅ) బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని... అందులో భాగంగా 1,400 కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రంలో దశలవారీగా మరో 1,050 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆధునిక, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందించడమే ప్రభుత్వ సంకల్పమని రాంప్రసాద్ రెడ్డి చెప్పుకొచ్చారు. భోగాపురం విమానాశ్రయం దూరమనే అపోహ అవసరం లేదని... హైదరాబాద్‌కు శంషాబాద్ విమానాశ్రయం ఎలా విజయవంతమైందో, భోగాపురం కూడా అలాగే అభివృద్ధికి కేంద్రంగా మారుతుందని తెలిపారు. విశాఖ అంటే ఉత్తరాంధ్రకు గుండెకాయ అని.. విశాఖ అభివృద్ధే ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు వేస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

# బీహార్ బంద్‌లో ఎకె 47తో కాల్పులు

## సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలు

రెండు రోజుల క్రితం 'బీహార్ బంద్' సందర్భంగా శివాన్ జిల్లాలో చోటుచేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై ఒక పోలీసు సిబ్బంది'ఏకే-47'రైఫిల్‌తో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయింది. ఈ ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఈనెల 25న బిహార్‌లో విద్యార్థి సంఘాలు చేపట్టిన ఈ బంద్ సందర్భంగా పలు జిల్లాల్లో నిరసనకారులకు, పోలీసులకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిని పాట్నాలోని జయప్రభ మేదాంత ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో 15 ఏళ్ల మహమ్మద్ ఆరిఫ్ అనే యువకుడు కూడా ఉన్నాడు. బంద్ కారణంగా దుకాణం మూసివేసి ఇంటికి తిరిగి వెళు ్తండగా మెడకు బు÷-లలెట్ తగిలిందని కుటుంబసభ్యులు తెలిపారు. వైద్యులు శస్త్రచికిత్స చేసి బుల్లెట్‌ను తొలగించారని, బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కాల్పుల ఘటనపై ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ డిమాండ్ చేస్తూ... కాల్పుల ఘటనకు సంబంధించిన వీడియోను నెట్‌లో షేర్ చేశాడు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ ఘటనపై స్పందిస్తూ.. ఢిల్లీలో నిరసన తెలిపే విద్యార్థులపై పె÷-లలెట్ తుపాకులు, బిహార్‌లో ఏకే-47లు ప్రయోగిస్తున్నారంటూ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.